క్లుప్తంగా

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



పాన్‌గల్: విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లిలో రెండు రోజుల క్రితం విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన బాధితుడు కుర్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్‌తో మాట్లాడి బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజుగౌడు, రాము, రవికుమార్, రమేష్, కృష్ణయ్య, భగవంతు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు



వనపర్తి రూరల్: మాజీ సర్పంచ్ నాగిరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని సవాయిగుడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ఆకస్మాత్తుగా మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చీర్ల జనార్దన్, ఎత్తం చరణ్‌రాజ్, హరిబాబురెడ్డి, ధర్మారెడ్డి, రవి, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

భారీ వర్షంతో వాహనదారుల ఇక్కట్లు



వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు మత్తడి దుంకాయి. దీంతో ప్రధాన రహదారుల్లోని కల్వర్టులపై భారీగా వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. తూంకుంట గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద వరద నీటి ఉధృతికి రైతులు ద్విచక్ర వాహనదారులు ఇతర మార్గాల ద్వారా వెళ్లాల్సి వచ్చింది.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం



మనీష(ఫైల్)

వనపర్తి రూరల్: డిగ్రీ విద్యార్థిని అదృశ్యం కావడంతో కేసు న మోదైన సంఘటన సోమ వారం వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ శశిధర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని షే కోపేటకు చెందిన ముమ్మడి మనీష వనపర్తి పట్టణంలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఎస్‌వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె సెప్టెంబర్ 29న దసరా సెలవులు ఇవ్వడంతో స్నేహితురాలితో కలిసి గద్వాల జిల్లా అనంతాపురం వెళ్లింది. ఈనెల 5న ఆమె తల్లిదండ్రులకు హైదరాబాద్ వ స్తున్నానని చెప్పింది. కూతురు ఇంటికి రాకపోవడంతో తల్లి ఉమ్మడి సాయిలీల సోమవారం వ నపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత



ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో గేదె మృత్యువాత పడిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం మల్కిమియాన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. మల్కిమియాన్‌పల్లి గ్రామానికి చెందిన పట్నం వెంకటయ్య గేదెలను సోమవారం గ్రామ శివారులోని పొలాలకు మేతకోసం తీసుకెళ్లాడు. మేతమేస్తున్న సమయంలో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు గేదెకు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి మాధవి, క్లస్టర్ రెవెన్యూ అధికారి కృష్ణయ్య, జూనియర్ లైన్‌మెన్ బాలరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ కష్టాలు



వనపర్తి తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న డీలర్ల సంఘం జిల్లా నాయకులు(ఫైల్)

- 6 నెలలుగా అందని కమీషన్
- కుటుంబ పోషణ భారంగా మారిన వైనం

జిల్లాలో రేషన్ దుకాణాలు: 335	
నెలకు అందించే బియ్యం : 3742.128 మెట్రిక్ టన్నులు	జిల్లాలో రేషన్ కార్డులు : 1,78,931
క్వింటాల్‌కు కమీషన్ : రూ.140	నెలకు కేంద్రం చెల్లించే కమీషన్ : రూ.1408లక్షలు
6 నెలలకు కమీషన్ అంచన : రూ.88.08లక్షలు	

వనపర్తి రూరల్: కమీషన్ చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలలుగా కమీషన్ కోసం జిల్లాలోని డీలర్లు ఎదురుచూస్తున్నారు. దుకాణం అద్దె, దిగుమతి, గుమస్తా ఖర్చులు భారంగా మారాయని వారు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ 1కిలో చొప్పున రేషన్ బియ్యం సరఫరా చేస్తోంది. కిలోకు రూ.1.45 పైసల చొప్పున కమీషన్ ఇస్తోంది. ఈ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. సెప్టెంబర్ నెల కమీషన్ రావాల్సి ఉంది. కేంద్రం ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ 5 కిలోల చొప్పున సరఫరా చేస్తోంది. ఒక కిలోకు 90 పైసల చొప్పున కమీషన్ చెల్లిస్తుంది. ఆ 0.90 పైసల కమీషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం వాటా 0.45 పైసలు, కేంద్ర ప్రభుత్వం వాట 0.45 పైసలు చెల్లిస్తుంది. జిల్లాల్లో 335 రేషన్ దుకాణాలు ఉండగా, కేంద్ర ప్రభుత్వం అందించిన రేషన్ కార్డులు 87,276, రాష్ట్ర ప్రభుత్వం అందించిన కార్డులు 91,655 మొత్తం జిల్లాల్లో 1,78,931 రేషన్ కార్డులున్నాయి. వీటికి నెలకు 3742.128 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతోంది. అరు నెలలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలోకు సంబంధించిన కమిషన్ 5 నెలలది అందించింది. ఒకనెల మాత్రం రాలేదు. కేంద్రం ఇచ్చే అయిదు కిలోలకు సంబంధించిన 6 నెలల కమీషన్ రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం, జూన్‌లో మూడు నెలలు కోటాను



చిట్యాల గ్రామంలో రేషన్ బియ్యం ఇస్తున్న డీలరు

ఒకేసారి పంపిణీ చేసింది. కమీషన్ డబ్బులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చెల్లించాల్సి ఉండగా, కేవలం రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కమీషన్ ఇచ్చింది. కేంద్రానికి చెందిన డబ్బులే ఎక్కువగా ఉండటం, ఇప్పటి వరకు అందించక పోవడంతో డీలర్లు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో అందించకుంటే ఆందోళన చేస్తామని డీలర్ల సంఘం హెచ్చరిస్తోంది.

నిర్వహణ భారంగా మారింది..



ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం చెల్లించే కమీషన్ రాకపోవడం, సెప్టెంబర్ నెల రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ ఇవ్వకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం. ఈ నెలలో దీపావళి పండుగ ఉంది. మా ఇబ్బందులు అర్థం చేసుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ కమీషన్ చెల్లించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం డీలర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– బచ్చురాము, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతి నెల కమీషన్ అందించాలి



రేషన్ డీలర్లకు ప్రతినెల కమీషన్ అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ చెల్లించినా నిరాశతోనే ఉన్నాం. కేంద్రం అందించే బియ్యం ఎక్కువ కావడంతో రెండు ప్రభుత్వాలు సమన్వయంతో డబ్బులు చెల్లించాలి. కమీషన్ కాకుండా నెల జీతం ఏర్పాటు చేయాలి. పూర్తి స్థాయిలో అందించకుంటే ఆందోళన చేపడుతాం.

– సహదేవుడు, రేషన్ డీలర్, పై శాఖాపూర్

కేంద్రం కమీషన్ ఖాతాల్లో జమ అవుతుంది

రాష్ట్ర ప్రభుత్వం వాటా కమీషన్ చెల్లించింది. కేంద్రం అందించే కమీషన్ రేషన్ డీలర్ల ఖాతాల్లో జమ అవుతుంది.

– కాశీవిశ్వనాథం, జిల్లా పౌర సరఫరాల అధికారి వనపర్తి

కుక్కలు, పందుల బెడద నివారించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: పట్టణంలో కుక్కలు, పందుల బెడద నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వాటిని నియంత్రించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ పట్టణంలోని 4వ, 5వ వార్డులలో పందులు, కుక్కలు తీవ్ర స్థాయిలో సంచరిస్తున్నాయని, ఇవి చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా వార్డులలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో మురుగులో పందుల సంచారం ఎక్కువైందని, వాటి వల్ల ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికే కుక్క కాటుతో పట్టణంలోని పలువురు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలు, పందులను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగరాజ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అరుణ్ కుమార్, విజయ్, సురేష్, నిషాంత్, అవాజ్ జిల్లా నాయకుడు షేక్ పాషా పాల్గొన్నారు.

వాల్మీకులు విద్యారంగంలో రాణించాలి



వాల్మీకి విగ్రహ ఆవిష్కరణలో సంఘం నాయకులు

పాన్‌గల్: వాల్మీకులు తమ పిల్లలను మంచిగా చదివించాలని, ప్రతి ఒక్కరు విద్యాపరంగా ఎదిగితేనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు రాంమూర్తినాయుడు, వేణుగోపాల్‌నాయుడు, నీలస్వామినాయుడు అన్నారు. సోమవారం మండలంలోని రేమద్దులలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాల్మీకి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు ఐకమత్యంతో పని చేయాలన్నారు. వాల్మీకులు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రవికుమార్‌నాయుడు, గ్రామ సంఘం నాయకులు కొంకల వెంకటయ్య, తులసీరాములు, బాలయ్య, లక్ష్మణ్, నాగరాజు, వెంకటనారాయణ, రాములు పాల్గొన్నారు.

తమ గ్రామాన్ని ఎస్సీలకు కేటాయించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వల్లభాపురం నాయకులు

వీపనగండ్ల: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని కోరుతూ వల్లభాపురం గ్రామానికి చెందిన పలువురు జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి ఆర్డీఓ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ ఏర్పాటు అయినప్పటి నుంచి సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించలేదని, గ్రామంలో 23శాతం ఎస్సీ జనాభా ఉన్నా బీసీలకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దేవరాజ్, ఉపాధ్యక్షుడు గంగాధర్, నాయకులు సంజీవ, బాలరాజు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణలో అవగాహన కలిగి ఉండాలి



ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న లక్ష్మప్ప

వీపనగండ్ల: ఎన్నికల నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి లక్ష్మప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం పనిచేసి ఓటింగ్ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్పీలు బోరెల్లి వెంకటేశ్, జితేందర్‌గౌడ్, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నియమ, నిబంధనలపై ఎన్నికల అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో



పోలింగ్ ఆఫీసర్లకు సూచనలు ఇస్తున్న ఆర్‌డీఓ

తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ నరసింహ, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, సీఆర్పీలు వెంకటేశ్, నాగరాజు పాల్గొన్నారు.

పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

ఆత్మకూర్: పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డీఓ విజయ భాస్కర్‌రెడ్డి కోరారు, ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని సమావేశ మందిరంలో పీఓ, ఏపీఓలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీపాద, ఎంపీఓ శ్రీరామ్‌రెడ్డి, ఎంఈఓ బాలరాజ్, పోలింగ్ ఆఫీసర్లు ఉన్నారు.

పీఓ, ఏపీఓల పాత్ర కీలకం



వనపర్తి రూరల్: ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా, సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో పీఓ, ఏపీఓల పాత్ర కీలకమని ఆర్డీఓ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఎంపీడీఓ రోజారెడ్డి ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల శిక్షణ కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు శిక్షణ కార్యక్రమంలో అన్ని అంశాలను క్షుణంగా తెలుసుకొని ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీగౌడ్, ఎంఈఓ జయరాములు, మాస్టర్ ట్రెయినర్లు కే చంద్రశేఖర్‌రెడ్డి, బి రవికుమార్, చిన్నరాములు, ఎల్లస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ లీకేజీ సమస్య పరిష్కరించాలి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేట కొత్తతండాలో కొన్నిరోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని, వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తండావాసులు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. ఇదే విషయం పంచాయతీ సెక్రటరీ పరశురాములును వివరణ కోరగా, తాను రాక ముందు సీసీ వేశారని, ప్రస్తుతం సీసీ రోడ్డు కింద లీకేజీ ఉందని చెప్పారు. సోమవారం లీకేజీకి మరమ్మతు చేసేందుకు ప్రయత్నించగా సీసీరోడ్డు కింద పగిలిపోవడం గుర్తించామని తెలిపారు. సీసీ పగులగొట్టి చేయాల్సి ఉందని, రెండు రోజుల్లో లీకేజీ మరమ్మతు పూర్తి అయిన వెంటనే మంచినీరు వస్తుందని తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని బొల్లారంలో సోమవారం ఇరువురు వ్యక్తులు ఘర్షణ పడడంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ కే.రాణి తెలిపారు. గ్రామానికి చెందిన దేవరపాగ రాముడు, దేవరపాగ నగిరే స్వామి పొలంగెట్టు విషయంలో ఒ కరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను కొత్తకోట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. పోలీస్ సిబ్బంది సోమవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో వడ్డెవాట వైపు నుంచి కొత్తకోటకు ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను ట్రాక్టర్, ఇసుకకు సంబంధించిన పత్రాలు అడుగగా ఎలాంటి పత్రాలు చూపలేదు. దీంతో స్టేషన్‌కు తరలించారు. కానాయపల్లి గ్రామానికి చెందిన ఆర్.శ్రీనివాసులుకు చెందిన ట్రాక్టర్ మదనాపురం మండలం గోవిందహళ్లి గ్రామ శివారులోని వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వీపనగండ్ల: మండలంలోని తూముకుంట ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆర్బీఎస్‌కే వైద్య బృందం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. చిన్నారుల ఎదుగుదల, బరువు, రక్తహీనత తదితర వాటిపై అవసరమైన పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, జంక్ ఫుడ్ తినకుండా సంపూర్ణ ఆహారం తీసుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ హరీష్ అన్నారు. ప్రధానోపాధ్యాయులు కిరణ్, హెల్త్ అసిస్టెంట్ స్వప్న, ఏఎన్ఎం ఉమ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగదు, సెల్‌ఫోన్లు చోరీ

కొత్తకోట రూరల్: కుటుంబ సభ్యుడు చనిపోతే నిద్ర చేసేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉండగా, గుర్తు తెలియని వ్యక్తులు నగదు, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. అమరచింత మండలం చంద్రఘడ్ గ్రామానికి చెందిన పర్వీన్ బేగం భర్త ఇటీవల మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పర్వీన్‌బేగం ఆదివారం సాయంత్రం కొత్తకోట పట్టణ సమీపంలోని టిక్కలయ్య దర్గా దగ్గరకు నిద్ర చేసేందుకు వచ్చారు. వీరు గాఢనిద్రలో ఉండగా మధ్యరాత్రి పర్వీన్ బేగం నిద్రలేచి తన హ్యాండ్ బ్యాగ్‌ను చూసుకోగా, కనిపించకపోవడంతో ఆందోళనకు గురై పక్కనే పడుకుని ఉన్న వారిని నిద్రలేపి విషయం చెప్పింది. బ్యాగులో ఉన్న రూ.20వేల నగదుతో పాటు 5 హ్యాండ్‌సెట్ ఫోన్లు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టిక్కలయ్య దర్గా ఎన్‌హెచ్44 పక్కనే ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిని ఢీకొట్టిన కారు

కొత్తకోట రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన సోమవారం పాలెం ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన కొండన్న పాలెం సమీపంలో ఓ గుడి దగ్గరకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కొండన్నకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

పాఠశాలకు తాళం

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టి పాఠశాలకు తాళం వేశారు. ఉపాధ్యాయులు ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి వెళ్లగా, ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ రామకృష్ణ సెలువులో ఉన్నారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో పాఠశాలకు తాళం వేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులను ఇళ్లకు పంపించడం ఏంటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరారు.

ఆరుగురిపై కేసు నమోదు

పాన్‌గల్: వరి పంటకు గడ్డి మందు పిచికారీ చేసి నష్టం కలిగించిన వారిపై ఫిర్యాదు చేసిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దావాజిపల్లికి చెందిన భూషన్నగౌడుకు సర్వే నం.59/6లో 08–30 గుంటల భూమి ఉంది. ఆ భూమిలో గ్రామానికి చెందిన వడ్లకొండ పెద్దలింగన్న, వడ్లకొండ లాలయ్య, వడ్ల కొండ బొక్కలయ్య, వడ్లకొండ ఎర్రన్న, వడ్లకొండ గోపాల్, వడ్లకొండ వెంకటయ్యలు ఆరుగురు కొంత భూమి తమకు వస్తుందని కొంతకాలంగా భూషన్నగౌడు తో గొడవ పడుతున్నారు. సోమవారం ఆ రుగురు భూషన్న గౌడు పొలంలోకి ప్రవేశించి వరి పంటకు గడ్డి మందు పిచికారీ చేసి నష్టం కలిగించారు. భూ వివాదాన్ని దృష్టిలో పెట్టుకొని గడ్డి మందు ను పి చికారీ చేసి వరి పంటకు నష్టం కలిగించిన ఆరుగురిపై తగు చర్యలు తీసుకోవాలని భూషన్నగౌడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ఫయాజ్(42) కుటుంబంతో కలిసి కొత్తకోటలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 28న కుమారుడు మౌజాన్‌తో కలిసి బైక్‌పై బయటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. కొత్తకోట పట్టణంలోని ట్రెండ్స్ సమీపంలో రాంగ్‌రూట్లో వస్తున్న ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఎదురుగా బైక్‌ను ఢీకొట్టింది. ఫయాజ్, కుమారుడు కింద పడిపోయారు. ఫయాజ్‌కు తీవ్ర గాయాలు కాగా, మౌజాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో జిల్లా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఫయాజ్ మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు వర్షంనీరు



వనపర్తి రూరల్: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని అప్పాయిపల్లి కుంట అలుగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రా మ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గరలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని పేర్కొన్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ



కొత్తకోట బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కొత్తకోట రూరల్: దసరా పండుగ సెలవులు ముగిసిన నేపథ్యంలో ఉద్యోగులు, విద్యార్థులు, ఊర్ల నుంచి తిరిగి వెళ్లే ప్రజలు సోమవారం ఉదయం కొత్తకోట బస్టాండ్‌లో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బస్టాండ్ ఉదయం నుంచి జనంతో సందడిగా మారింది. దసరా రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. బస్సుల కొరత కారణంగా కొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇప్పటికైనా అధికారులు పండుగ వేళల్లో బస్సుల సంఖ్య పెంచి ప్రయాణికులకు



బస్టాండ్ ఎదురుగా ప్రైవేట్ వాహనాలకు వెళ్తున్న ప్రయాణికులు

ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు అభిప్రాయపడ్డారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించాలి

పాన్‌గల్: కనుమరుగవుతున్న కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ, కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కళాకారుల గురువు వడ్ల వెంకటస్వామి అన్నారు. మండలంలోని రేమద్దులలో దసరా పండుగ సందర్భంగా గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర పై పౌరాణిక నాటకం దిగ్విజయంగా ప్రదర్శించిన సందర్భంగా సోమవారం కళాకారుల గురువు వడ్ల వెంకటస్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామస్తుల సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని నాటకాలను ప్రదర్శిస్తానన్నారు. గ్రామానికి చెందిన



ఆత్మకూరు కుటుంబ సభ్యులు వడ్ల వెంకటస్వామికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.